పూలే దంపతులకు భారతరత్న ఇవ్వాలి

- వారి ఆశయాల సాధనే నిజమైన నివాళి
- మండలిలో బీఆర్ఎస్ పక్షనేత మధుసూదనాచారి
- బాలికల విద్యాభివృద్ధికి ఎనలేని కృషి: ఎంపీ వద్దిరాజు
- తెలంగాణభవన్‌లో సావిత్రీబాయి జయంతి

సావిత్రీబాయి చిత్రపటానికి నివాళులర్పించిన బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్, ఎంపీ వద్దిరాజు రవిచంద్ర, ఎమ్మెల్యే కౌశిక్‌రెడ్డి, ఎమ్మెల్సీ పోచంపల్లి శ్రీనివాస్‌రెడ్డి, మాజీ మంత్రి శ్రీనివాస్‌గౌడ్ మాజీ ఎమ్మెల్యేలు

తెలంగాణభవన్‌లో సావిత్రీబాయి చిత్రపటానికి నివాళులర్పిస్తున్న శాసనమండలి ప్రతిపక్ష నేత మధుసూదనాచారి, మాజీ మంత్రి శ్రీనివాస్‌గౌడ్, నేతలు దేవీప్రసాద్, తుల ఉమ, తదితరులు

హైదరాబాద్, జనవరి 3 (నమస్తే తెలంగాణ): పూలే దంపతులకు కేంద్ర ప్రభుత్వం భారతరత్న ఇచ్చి సముచితంగా గౌరవించుకోవాలని శాసనమండలిలో బీఆర్ఎస్ పక్ష నేత మధుసూదనాచారి విజ్ఞప్తిచేశారు. సంఘ సంస్కర్త సావిత్రీబాయి పూలే 194వ జయంతి సందర్భంగా శుక్రవారం తెలంగాణభవన్‌లో ఆ మహనీయురాలి చిత్రపటానికి పార్టీ నేతలతో పాటు బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కే తారక రామారావు నివాళులర్పించారు. సావిత్రీబాయి సేవలను స్మరించుకున్నారు. ఈ సందర్భంగా మధుసూదనాచారి మాట్లాడుతూ.. వారి ఆశయాలను సాధించడమే నిజమైన నివాళి అని పేర్కొన్నారు. దేశం అన్ని రంగాల్లో బాగుపడాలంటే చదువు ముఖ్యమైన ఆయుధమని భావించి మహిళా విద్య కోసం సావిత్రీబాయి ఎంతో కృషి చేశారని గుర్తుచేశారు. పూలే దంపతుల స్ఫూర్తితో రాష్ట్రంలో వందలాది గురుకులాలను కేసీఆర్ స్థాపించారని చెప్పారు. రాజ్యసభ ఎంపీ వద్దిరాజు రవిచంద్ర మాట్లాడుతూ దేశంలో తొలి మహిళా ఉపాధ్యాయురాలిగా బాలికల విద్యాభివృద్ధికి ఎనలేని కృషి చేశారని గుర్తుచేశారు. మాజీ మంత్రి శ్రీనివాస్‌గౌడ్ మాట్లాడుతూ దేశంలో అట్టడుగు వర్గాలకు విద్యావకాశాలకు నాంది పలికింది పూలే దంపతులేనని పేర్కొన్నారు. బీఆర్ఎస్ నాయకురాలు తుల ఉమ మాట్లాడుతూ రాజకీయాల్లో, వ్యాపారాల్లో రాణిస్తున్నామంటే సావిత్రీబాయి స్ఫూర్తే కారణమని పేర్కొన్నారు. బేవరేజెస్ కార్పొరేషన్ మాజీ చైర్మన్ దేవీప్రసాద్ మాట్లాడుతూ బీసీలకు విద్యనందించడంలో సావిత్రీబాయి పాత్ర ఎనలేనిదని ప్రశంసించారు. ఎమ్మెల్సీ పోచంపల్లి శ్రీనివాస్‌రెడ్డి, ఎమ్మెల్యే పాడి కౌశిక్‌రెడ్డి, మాజీ ఎంపీలు బడుగుల లింగయ్యయాదవ్, రావుల చంద్రశేఖర్‌రెడ్డి, మాజీ ఎమ్మెల్యేలు రవీంద్రకుమార్, పద్మాదేవేందర్‌రెడ్డి, పట్లోళ్ల శశిధర్‌రెడ్డి, ముత్తిరెడ్డి యాదగిరిరెడ్డి, సాహిత్య అకాడమీ మాజీ చైర్మన్ జూలూరు గౌరీశంకర్, బీఆర్ఎస్ నాయకులు గట్టు రామచంద్రరావు, పల్లె రవి, గెల్లు శ్రీనివాస్ యాదవ్, చిరుమళ్ల రాకేశ్, సతీశ్‌రెడ్డి, మన్నె గోవర్ధన్‌రెడ్డి, బొమ్మెర రామ్మూర్తి, ఉపేంద్ర, గోపగాని రఘురామ్, కిశోర్‌గౌడ్, తుంగబాలు, గాంధీనాయక్, అరుణ, సుశీలారెడ్డి, అర్పితాప్రకాశ్, రుద్ర రాధ, రేఖ శామిలేటి తదితరులు పాల్గొన్నారు.

ఎన్నికల కేసును కొట్టేయండి

- హైకోర్టులో ఎమ్మెల్యే కౌశిక్‌రెడ్డి పిటిషన్

హైదరాబాద్, జనవరి 3 (నమస్తే తెలంగాణ): ఎన్నికల ప్రవర్తనా నియమావళిని ఉల్లంఘించానన్న అభియోగంతో 2023 నవంబర్ 29న కమలాపూర్ పోలీస్ స్టేషన్‌లో తనపై నమోదైన కేసును కొట్టేయాలని కోరుతూ హుజూరాబాద్ ఎమ్మెల్యే పాడి కౌశిక్‌రెడ్డి హైకోర్టును ఆశ్రయించారు. అసెంబ్లీ ఎన్నికల్లో తనను గెలిపిస్తే విజయయాత్రకు వస్తానని, లేకుంటే మీరే మా శవయాత్రకు రావాలని తాను ఓటర్లను బెదిరించినట్టు వీడియో ఉన్నదంటూ కమలాపురం ఎంపీడీవో జీ బాబు పోలీసులకు ఫిర్యాదు చేయడాన్ని తప్పుపట్టారు. నిజానికి తాను ఎలాంటి నేరం చేయలేదని, అయినప్పటికీ రాజకీయ కక్షతో తనపై అన్యాయంగా కేసు నమోదు చేశారని హైకోర్టుకు విన్నవించారు.

9న తప్పక హాజరుకావాలి

- మంత్రి సురేఖకు కోర్టు ఆదేశం

నాంపల్లి క్రిమినల్ కోర్టులు, జనవరి 3 (నమస్తే తెలంగాణ): సినీ నటుడు అక్కినేని నాగార్జున దాఖలు చేసిన పరువు నష్టం కేసులో నిందితురాలిగా ఉన్న మంత్రి కొండా సురేఖ శుక్రవారం కోర్టు విచారణకు హాజరు కాలేదు. ప్రభుత్వ కార్యకలాపాలతో బిజీగా ఉండటమే ఇందుకు కారణమని పేర్కొంటూ ఆమె తరపు న్యాయవాది గిర్వాజరు పిటిషన్‌ను దాఖలు చేశారు. దీంతో కొండా సురేఖ ఇప్పటివరకు ఒక్కసారి కూడా విచారణకు హాజరు కాలేదని గుర్తుచేస్తూ.. ఈ నెల 9న జరిగే తదుపరి విచారణకు తప్పనిసరిగా హాజరు కావాలని ఆదేశించారు.

విజిలెన్స్ డైరెక్టర్‌గా ఏఆర్ శ్రీనివాస్

హైదరాబాద్, జనవరి 3 (నమస్తే తెలంగాణ): రాష్ట్ర విజిలెన్స్, ఎన్‌ఫోర్స్‌మెంట్ డైరెక్టర్‌గా రిటైర్డ్ ఐపీఎస్ అధికారి ఏఆర్ శ్రీనివాస్‌ను ప్రభుత్వం నియమించింది. ఈ మేరకు ప్రభుత్వ ప్రధానకార్యదర్శి శాంతికుమారి శుక్రవారం ఉత్తర్వులు జారీచేశారు.

42శాతం కోటా ఇవ్వాల్సిందే

బీసీ డిక్లరేషన్‌పై మాట తప్పితే తరిమికొడతాం • బీసీలంటే కాంగ్రెస్, బీజేపీకి ఎందుకు చులకన?

పీసీసీ అధ్యక్షుడి సవాల్‌ను స్వీకరిస్తున్నా • బీఆర్ఎస్ హయాంలో బీసీల అభివృద్ధిపై చర్చకు సిద్ధం: కవిత

- ఎప్పుడైనా, ఎక్కడైనా చర్చకు వస్తా
- నేను చెప్పింది తప్పయితే రాజకీయాల నుంచి తప్పుకుంటా
- బీసీల పక్షాన నిలబడితే ప్రభుత్వానికి భయమెందుకు?
- బీసీ మహాసభలో బీఆర్ఎస్ ఎమ్మెల్సీ కల్వకుంట్ల కవిత

ఇందిరాపార్కువద్ద శుక్రవారం నిర్వహించిన బీసీ మహాసభలో మాట్లాడుతున్న ఎమ్మెల్సీ కవిత, సభకు హాజరైన ప్రజలు

హైదరాబాద్, జనవరి 3 (నమస్తే తెలంగాణ): కాంగ్రెస్ సర్కార్ ఇచ్చిన మాట ప్రకారం కామారెడ్డి బీసీ డిక్లరేషన్‌ను అమలు చేయకపోతే బీసీలంతా ఏకమై తరిమికొట్టేందుకు సిద్ధంగా ఉన్నారని బీఆర్ఎస్ ఎమ్మెల్సీ కల్వకుంట్ల కవిత హెచ్చరించారు. హైదరాబాద్‌లోని ఇందిరాపార్కు వద్ద తెలంగాణ జాగృతి ఆధ్వర్యంలో శుక్రవారం బీసీ మహాసభ నిర్వహించారు. ఈ సందర్భంగా కవిత మాట్లాడుతూ.. బీసీలకు స్థానిక సంస్థల్లో 42% రిజర్వేషన్లు ప్రకటించిన తర్వాతనే ఎన్నికలు నిర్వహిస్తామని సీఎం రేవంత్‌రెడ్డి ఇచ్చిన హామీని నిలబెట్టుకోవాలని డిమాండ్ చేశారు. అధికారంలోకి వచ్చిన వెంటనే వేయాల్సిన డెడికేటెడ్ కమిషన్‌ను కావాలనే ఆలస్యంగా నియమించారని ఆరోపించారు. కర్ణాటక, బీహార్ రాష్ట్రాల్లో విఫలమైన అనుభవాలు ఉన్నప్పటికీ, తెలంగాణ జాగృతి ఉద్యమం చేపట్టేవరకు, హైకోర్టు మొట్టికాయలు వేసేంత వరకు ప్రభుత్వం డెడికేటెడ్ కమిషన్‌ను నియమించలేదని విమర్శించా రు. బీసీల లెక్కలను ఒక కమిషన్ తీస్తుంటే, నివేదికను మరో కమిషన్ ఇస్తున్నదని, ఇలా చేస్తే కోర్టుల్లో నిలబడుతుందా? అని ప్రశ్నించారు.

రేవంత్‌రెడ్డి బీసీ వ్యతిరేకి

బీసీ వర్గాల్లో ఉన్న 130 కులాల్లో ఒక్కో కులానికి ఒక్కో సమస్య ఉన్నదని కవిత ఆవేదన వ్యక్తంచేశారు. వాటిని పరిష్కరించడానికి ముఖ్యమంత్రికి మనసొప్పడం లేదని దుయ్యబట్టారు. కులవృత్తుల వారికి కేసీఆర్ అమలు చేసిన పథకాలను నిలిపివేయడం దారుణమని మండిపడ్డారు. కేసీఆర్ హయాంలో ప్రతి కులం వాళ్లు ఆత్మగౌరవంతో బతికారని చెప్పారు. కాంగ్రెస్ సర్కార్ కొత్త పథకాలను అమలు చేయకపోయినా, కేసీఆర్ అమలు చేసిన పాత పథకాలను కొనసాగించాలని డిమాండ్ చేశారు.

> కాంగ్రెస్, బీజేపీ బీసీలకు తీరని అన్యాయం చేశాయి. నేను చెప్పినవి తప్పయితే శాశ్వతంగా రాజకీయాల నుంచి తప్పుకుంటా. ప్రాంతీయ పార్టీల ద్వారా కేసీఆర్, ఎన్టీఆర్ బీసీలకు న్యాయం చేశారు. తమిళనాడు, పశ్చిమబెంగాల్ రాష్ట్రాల్లోని ప్రభుత్వాలు బీసీలకు పెద్దపీట వేశాయి.
>
> - ఎమ్మెల్సీ కల్వకుంట్ల కవిత

సావిత్రీబాయి జయంతిపై దిగొచ్చిన సర్కార్

తెలంగాణ జాగృతి, బీసీ సంఘాల ఉద్యమాల వల్లనే సావిత్రీబాయి పూలే జయంతిని అధికారికంగా నిర్వహించాలని ప్రభుత్వం నిర్ణయించిందని కవిత పేర్కొన్నారు. సావిత్రీబాయి జయంతి రోజున మహాసభ నిర్వహిస్తున్నామని తెలియగానే అధికారికంగా నిర్వహిస్తున్నట్టు ప్రభుత్వం ప్రకటించిందని చెప్పారు. మన ఉద్యమాలతో జంగుపట్టిన ప్రభుత్వ రథచక్రాలు కదులుతున్నాయని పేర్కొన్నారు. బీసీలకు మంచి రోజులు వస్తాయని, కులం ఆధారంగా రాజ్యాంగ నిర్మాతలు కొన్ని రక్షణలు కల్పించారని వివరించారు. అంబేద్కర్ కృషి లేకుంటే ఎస్సీ, ఎస్టీలకు ఎటువంటి ఫలాలు దక్కకపోతుండేవని గుర్తుచేశారు. అదే సమయంలో బీసీ కులాలకు సైతం రాజ్యాంగంలో రక్షణ కల్పించాల్సిన అవసరం ఉన్నదని చెప్పారు. ఆనాడే బీసీలకు రాజ్యాంగపరమైన రక్షణ కల్పించి ఉంటే అభివృద్ధిలో భారతదేశం అమెరికాను దాటేదని పేర్కొన్నారు.

కాంగ్రెస్, బీజేపీ.. బీసీ వ్యతిరేక పార్టీలు

బీసీలకు లబ్ధి చేకూర్చే కాకా కాలేల్కర్ కమిషన్‌ను తిరస్కరించి నాటి భారత తొలి ప్రధాని నెహ్రూ బీసీ వ్యతిరేకిగా చరిత్రలో నిలిచిపోయారని కవిత ఆరోపించారు. ఇది బీసీలకు కాంగ్రెస్ పార్టీ చేసిన ద్రోహం కాదా? అని ప్రశ్నించారు. మొరార్జీదేశాయ్ నియమించిన మండల్ కమిషన్ నివేదికను ఏండ్ల తరబడి కాంగ్రెస్ పార్టీ తొక్కిపెట్టిందని ఆగ్రహం వ్యక్తంచేశారు. 1980లో మండల్ కమిషన్ నివేదిక ఇస్తే కాంగ్రెస్ ప్రభుత్వం ఎందుకు అమలు చేయలేదని నిలదీశారు. బీసీల కోసం పనిచేస్తున్న వీపీ సింగ్ ప్రభుత్వాన్ని బీజేపీ కూలగొట్టిందని విమర్శించారు. నెహ్రూ, ఇందిరాగాంధీ, రాజీవ్‌గాంధీ హయాంలో బీసీలకు తీరని అన్యాయం జరిగిందని ధ్వజమెత్తారు. బీసీలకు రిజర్వేషన్లు ఇస్తే దేశం విచ్ఛిన్నం అవుతుందని అనాడు రాజీవ్‌గాంధీ అన్నారని పేర్కొన్నారు. బీసీల రిజర్వేషన్లు పెంచాల్సి వస్తుందని 2011 కులగణన చేసిన నివేదికను అప్పటి యూపీఏ ప్రభుత్వం బహిర్గతం చేయకుండా ఆపిందని ఆరోపించారు. ఆ తర్వాత 2014లో అధికారంలోకి వచ్చిన బీజేపీ ప్రభుత్వం కూడా నివేదికను బయట పెట్టకుండా మోసం చేసిందని విమర్శించారు. బీసీ కులగణన చేయబోమని బీజేపీ బహిరంగాగానే ప్రకటించిందని మండిపడ్డారు.

> మన ఉద్యమాలతో జంగుపట్టిన ప్రభుత్వ రథచక్రాలు కదులుతున్నాయి. బీసీలకు మంచి రోజులొస్తాయి. బీసీ కులాలకు సైతం రాజ్యాంగంలో రక్షణ కల్పించాల్సిన అవసరం ఉన్నది. ఆనాడే బీసీలకు రాజ్యాంగపరమైన రక్షణ కల్పించి ఉంటే అభివృద్ధిలో భారతదేశం అమెరికాను దాటేది.
>
> - ఎమ్మెల్సీ కల్వకుంట్ల కవిత

సావిత్రీబాయి ఆడబిడ్డ కాదు.. పులిబిడ్డ

'సావిత్రీబాయి పూలే ఆడబిడ్డ కాదు.. పులి బిడ్డ. మహిళా విద్యకు ఎంతగానో కృషి చేశారో. ఎంతోమంది మహిళలకు చదువు నేర్పించారు. ఎన్ని అవాంతరాలు ఎదురైనా సమాజ వికాసం కోసం పని చేశారు. మహిళా విద్యకు ఎంతగానో కృషి చేశారు. సభలో 70 మందికిపైగా బీసీ సంఘాల నేతలు ప్రసంగించారు. కార్యక్రమంలో కరీంనగర్ మాజీ జడ్పీ చైర్‌పర్సన్ తుల ఉమ, కరీంనగర్ మాజీ మేయర్ రవీందర్‌సింగ్, సుమిత్రా ఆనంద్‌తానోబా, బీఆర్ఎస్ నేతలు రూప్‌సింగ్, ముఠా జైసింహా, గట్టు రామచందర్‌రావు, క్యామ మల్లేశం, పల్లె రవికుమార్‌గౌడ్, గడ్డం శ్రీనివాస్‌యాదవ్, మఠం భిక్షపతి, కిశోర్‌గౌడ్, ఉపేందర్, జాగృతి నేతలు నవీన్‌ఆచారి, వరలక్ష్మి మంచాల, అనంతుల ప్రశాంత్, పెంట రాజేశ్, అప్పాల నరేందర్ యాదవ్, పరకాల మనోజ్ గౌడ్, కిశోర్‌యాదవ్, బీసీ సంఘాల నేతలు బొల్ల శివశంకర్, ఆలకుంట్ల హరి, మహేందర్, గోవర్ధన్‌యాదవ్, నరసింహ, గోప సదానంద్, కోట్ల యాదగిరి, ఎం నరహరి, దుగట్ల నరేశ్, ఇతరి మారయ్య, కుమారస్వామి, గంధాల శ్రీనివాస్‌చారి, రమేశ్ బాబు, జీ హరిప్రసాద్, సురేందర్, విజేందర్‌సాగర్, శ్రీధర్‌చారి, రవీంద్రనాథ్, కే శ్రీనివాస్, ప్రవీణ్, అఖిల్, హరిదేవ్‌సింగ్, సురేశ్, మురళీకృష్ణ, వీరన్న, మందుల శ్రీనివాస్, కే నరసింహరాజు, ప్రవీణ్, పార్వతయ్య, నరసింహ, కడెకేకర్ రాకేశ్, ఆవుల మహేశ్, ఎంగులూరి శ్రీను, హుస్సేన్, రామచందర్, వాడేపల్లి మాధవ్, శ్యాంసింగ్ లోదే, దామ శివకుమార్, వేణుమాధవ్, ఎండీ నవీద్, వరలక్ష్మి, స్వప్న, లావణ్యయాదవ్, పద్మాగౌడ్ సూర్యపల్లి పరశురాం, ఏచాల దత్తాత్రేయ, జిల్లా నరేందర్, డాక్టర్ కీర్తిలతాగౌడ్, వింజమూరి రాఘవాచారి, సాల్వాచారి, రూపాదేవి, అప్ప సతీశ్ తదితరులు పాల్గొన్నారు.

బీసీ రిజర్వేషన్ ప్రకటించకపోతే మరో ఉద్యమం: స్వామిగౌడ్

బండ్లగూడ, జనవరి 3: బీసీలంతా ఏకమై తమ హక్కులను సాధించుకునే సమయం వచ్చిందని శాసనమండలి మాజీ చైర్మన్ స్వామిగౌడ్ పిలుపునిచ్చారు. ఇందిరాపార్క్ వద్ద తెలంగాణ జాగృతి అధ్యక్షురాలు, ఎమ్మెల్సీ కల్వకుంట్ల కవిత ఆధ్వర్యంలో నిర్వహించిన బీసీల మహాసభకు బండ్లగూడ జాగీర్ మున్సిపల్ కార్పొరేషన్ నుంచి బీఆర్ఎస్ అధ్యక్షుడు రావులకోళ్ల నాగరాజు ఆధ్వర్యంలో స్థానిక బీసీ నాయకులు, ప్రజలు పెద్ద ఎత్తున తరలివెళ్లారు. ఈ సందర్భంగా స్వామిగౌడ్ జెండా ఊపి బస్సును ప్రారంభించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ.. కామారెడ్డి డిక్లరేషన్‌కు అనుగుణంగా బీసీ రిజర్వేషన్ ఇవ్వకపోతే భవిష్యత్‌లో పెద్ద ఎత్తున ఉద్యమం తప్పదని హెచ్చరించారు.

హామీ నెరవేర్చేదాకా కొట్లాడతాం

'బీసీల గురించి ఎందుకు మాట్లాడుతున్నారంటూ కాంగ్రెస్ నాయకులు నన్ను ప్రశ్నిస్తున్నారు. సందర్భం వచ్చింది కాబట్టి మాట్లాడుతున్నా.. ఎన్నికలు పూర్తయ్యాక ఎందుకు మాట్లాడలేదని మళ్లీ కాంగ్రెస్ నాయకులే అంటారు. ఎటువంటి లోటుపాట్లు లేకుండా స్థానికసంస్థల ఎన్నికల్లో బీసీలకు 42% రిజర్వేషన్లు కల్పించేదాకా మాట్లాడుతూనే ఉంటా.. కొట్లాడుతూనే ఉంటా. బీసీలకు 42% రిజర్వేషన్లు కల్పిస్తామని హామీ ఇచ్చింది కాబట్టి కాంగ్రెస్ ప్రభుత్వం అమలు చేయాల్సిందే. లేదంటే.. బీసీల జనాభా ఎంత ఉంటే అంత వాటా ఇచ్చి ఎన్నికల్లోకి వెళ్లాలి. దొంగలెక్కలు, కాకిలెక్కలు కాకుండా వాస్తవలెక్కలు తీయాలి' అని ఎమ్మెల్సీ కవిత పేర్కొన్నారు.

ఎప్పుడైనా.. ఎక్కడైనా చర్చకు సిద్ధం...

బీఆర్ఎస్ హయాంలో బీసీల అభివృద్ధి, ఏడాది కాంగ్రెస్ పాలనలో చేసిన అభివృద్ధిపై చర్చించడానికి సిద్ధమా? అని పీసీసీ అధ్యక్షుడు మహేశ్‌కుమార్‌గౌడ్ విసిరిన సవాల్‌ను ఎమ్మెల్సీ కవిత స్వీకరించారు. 'ఎక్కడైనా.. ఎప్పుడైనా.. ఏ గల్లీలోనైనా.. ఏ సెంటర్లోనైనా.. చర్చకు నేను సిద్ధం. కేసీఆర్ నాయకత్వంలో పదేండ్లలో జరిగిన అభివృద్ధి ఎంత, కాంగ్రెస్ ప్రభుత్వ ఏడాది పాలనలో చేసిన అభివృద్ధి ఎంత అన్న దానిపై చర్చించడానికి సిద్ధమని ప్రకటించారు.

హైకోర్టులో 1,673 పోస్టులు

- దరఖాస్తుకు జనవరి 31 తుది గడువు

హైదరాబాద్, జనవరి 3 (నమస్తే తెలంగాణ): తెలంగాణ న్యాయ మంత్రిత్వ శాఖ, సబార్డినేట్ సర్వీస్‌లో పోస్టుల భర్తీకి హైకోర్టు నోటిఫికేషన్ విడుదల చేసింది. హైకోర్టు పరిధిలో 212, తెలంగాణ జ్యూడీషియల్ మినిస్టీరియల్, సబార్డినేట్ సర్వీస్ పరిధిలో నాన్ టెక్నికల్ 1,277, టెక్నికల్ 184 ఇలా మొత్తం 1,673 పోస్టులు ఖాళీగా ఉన్నాయి. కోర్టు మాస్టర్/పర్సనల్ సెక్రటరీస్, కంప్యూటర్ ఆపరేటర్, అసిస్టెంట్, ఎగ్జామినర్, టైపిస్ట్, కాపీయిస్ట్, ఆఫీస్ సబార్డినేట్, సిస్టమ్ అనలిస్ట్ తదితర పోస్టులు ఖాళీగా ఉన్నాయి. పదో తరగతి, ఇంటర్, డిగ్రీ ఉత్తీర్ణతతోపాటు అనుభవం ఉండాలి. వయోపరిమితి 18-34 ఏండ్ల మధ్య ఉండాలి. కంప్యూటర్ బేస్డ్ టెస్ట్, మెరిట్ లిస్ట్, స్కిల్ టెస్ట్, సర్టిఫికెట్ వెరిఫికేషన్ ద్వారా పోస్టులను భర్తీ చేస్తారు. ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకోవడానికి చివరి తేదీ జనవరి 31. వివరాలకు వెబ్‌సైట్ https://tshc.gov.inను చూడవచ్చు.

సీయూఈటీ పీజీ దరఖాస్తు ఫీజు పెంపు

మార్చి 13 నుంచి 31 వరకు పరీక్షలు • షెడ్యూల్‌ను విడుదల చేసిన ఎన్టీఏ

హైదరాబాద్, జనవరి 3 (నమస్తే తెలంగాణ) : సెంట్రల్ యూనివర్సిటీలు, ఇతర విద్యాసంస్థల్లోని పీజీ కోర్సుల్లో ప్రవేశాలకు నిర్వహించే కామన్ యూనివర్సిటీ ఎంట్రెన్స్ టెస్ట్(సీయూఈటీ) పీజీ షెడ్యూల్ విడుదలైంది. నేషనల్ టెస్టింగ్ ఏజెన్సీ(ఎన్టీఏ) పరీక్షల షెడ్యూల్‌ను విడుదల చేసింది. అన్ని క్యాటగిరీల దరఖాస్తు ఫీజులను రూ. 200 పెంచింది. ఇది వరకు రెండు జనరల్ పేపర్లకు ఫీజు రూ.1200 ఉండగా, దీనిని రూ.1400కు పెంచింది. జనరల్ ఈడబ్ల్యూఎస్ అభ్యర్థుల ఫీజు రూ. వెయ్యి ఉండగా రూ.1200కు, ఎస్సీ, ఎస్టీ, థర్డ్‌జెండర్ అభ్యర్థుల ఫీజు రూ.900 ఉండగా, రూ.1100కు, దివ్యాంగ అభ్యర్థుల ఫీజు రూ.900ఉంటే రూ.వెయ్యికి పెంచింది. ఇది వరకు పరీక్షా సమయం 105 నిమిషాలుండగా, ఇప్పుడు 90 నిమిషాలకు కుదించింది.

సీయూఈటీ - పీజీ షెడ్యూల్

దరఖాస్తుకు గడువు	ఫిబ్రవరి 1, 2025
ఫీజు చెల్లించేందుకు గడువు	ఫిబ్రవరి 2, 2025
తప్పుల సవరణ	ఫిబ్రవరి 3 నుంచి 5, 2025
అడ్మిట్‌కార్డుల డౌన్‌లోడింగ్	పరీక్షకు నాలుగురోజుల ముందుగా
పరీక్షలు	మార్చి 13 నుంచి 31, 2025

కడియం శ్రీహరి.. 'ఊసరవెల్లి'

- సిగ్గుంటే పదవికి రాజీనామా చెయ్
- కడియంపై ఎమ్మెల్యే పల్లా ఆగ్రహం



జనగామలోని క్యాంపు కార్యాలయంలో లబ్ధిదారులకు సీఎంఆర్ఎఫ్ చెక్కులను పంపిణీ చేస్తున్న ఎమ్మెల్యే పల్లా రాజేశ్వర్‌రెడ్డి

జనగామ, జనవరి 3 (నమస్తే తెలంగాణ): 'ఊసరవెల్లిలా రంగులు మార్చి.. పొద్దుతిరుగుడు పువ్వులా ఏ పార్టీ అధికారంలో ఉంటే ఆ పార్టీకి మారి రాజకీయ పబ్బం గడుపుకునే కడియం శ్రీహరి.., నీకు గోరీ కడతం.. జాగ్రత్త బిడ్డా.. సిగ్గుంటే ఎమ్మెల్యే పదవికి రాజీనామా చెయ్'..అని జనగామ ఎమ్మెల్యే పల్లా రాజేశ్వర్‌రెడ్డి స్టేషన్‌ఘన్‌పూర్ ఎమ్మెల్యేపై తీవ్రస్థాయిలో ఫైర్ అయ్యారు. శుక్రవారం జనగామలోని క్యాంపు కార్యాలయంలో లబ్ధిదారులకు సీఎంఆర్ఎఫ్ చెక్కులను పంపిణీ చేశారు. అనంతరం పల్లా మాట్లాడుతూ.. కడియం శ్రీహరి పదవి పిచ్చోడు.. ఏపార్టీ అధికారంలో ఉంటే ఆపార్టీకి వెళ్తడు..ఆయన బిడ్డకు ఎంపీ టికెట్ ఇస్తే పైసలతో సహా వెళ్లి మోసం చేసిండు.. గులాబీ జెండా కింద గెలిచిన ఆయనకు.., ఏ మాత్రం సిగ్గు, శరం ఉన్నా వెంటనే రాజీనామా చేయాలని డిమాండ్ చేశారు. కేసీఆర్ పక్కన, బీఆర్ఎస్‌లో చేరితే కడియం శ్రీహరిని నాయకులు, ప్రజలంతా కష్టపడి గెలిపిస్తే.. కేసీఆర్, కేటీఆర్, కవితపై అవాకులు, చెవాకులు కూస్తున్నాడని మండిపడ్డారు. 'రెండుసార్లు అవకాశం ఇచ్చింది కేసీఆర్ కాదా..? నీ బిడ్డకు ఎంపీ టికెట్ ఇస్తే పైసలతో వెళ్లి మోసం చేసింది నువ్వు కాదా..? నీలాంటి వాళ్లకు ఉప ఎన్నిక వస్తది.. నిన్ను పాతర పెట్టడం ఖాయం.. 40 ఏళ్ల రాజకీయం అంటున్నావు.. ఒక్క డిగ్రీ కాలేజీ అయినా తెచ్చావా..? నేను తీసుకువచ్చిన ఎత్తిపోతలకు కొబ్బరికాయ కొడ్తావా.. సిగ్గు, శరం ఉండాలి..రాజీనామా చేసి గెలిచి అవసరముంటే అప్పుడు కొట్టు' అని సవాల్ విసిరారు. 'కేసీఆర్‌పై మాట్లాడే మొనగాడివి కాదు నువ్వు.. ప్రజల దయాదాక్షిణ్యాలు, పార్టీ జెండా కింద గెలిచావ్.. మా నాయకుల దగ్గర నుంచి టికెట్‌లు పొందావు.. పదవులు పొందావ్.. అధికారం అనుభవించావ్'.. అని మండిపడ్డారు. ఏడాది కాలంలో వెయ్యికి పైగా సీఎంఆర్ఎఫ్ చెక్కులు, కల్యాణలక్ష్మి చెక్కుల విషయంలో ఏ ఒక్కరోజు ఆలస్యం కాకుండా అందించామని చెప్పారు. కొంతమంది కేసీఆర్ పెట్టిన భిక్షతో ఎన్నికైన వారు కారుకూతలు కూస్తున్నారు.. అలాంటి వారిని ఎక్కడికక్కడ ఎండగట్టాలని కార్యకర్తలు, నాయకులకు పిలుపునిచ్చారు.

సీఎం మెప్పుకోసమే కేసీఆర్‌పై కడియం విమర్శలు

- స్టేషన్‌ఘన్‌పూర్ మాజీ ఎమ్మెల్యే రాజయ్య



స్టేషన్‌ఘన్‌పూర్, జనవరి 3: సీఎం రేవంత్‌రెడ్డి నుంచి సానుభూతి పొందేందుకే ఎమ్మెల్యే కడియం శ్రీహరి మాజీ సీఎం కేసీఆర్ కుటుంబంపై విమర్శలు చేస్తున్నారని స్టేషన్‌ఘన్‌పూర్ మాజీ ఎమ్మెల్యే తాటికొండ రాజయ్య శుక్రవారం ఒక ప్రకటనలో మండిపడ్డారు. బీఆర్ఎస్‌లో కేసీఆర్ పుణ్యమా అని ఉప ముఖ్యమంత్రితోపాటు పలు పదవులు చేపట్టి, పదేళ్లు కేసీఆర్ కుటుంబాన్ని పొగిడిన నోటితో మళ్లీ ఎలా విమర్శిస్తున్నారని ప్రశ్నించారు. కాళేశ్వర ప్రాజెక్టు మాదిరిగా ప్రపంచంలో ఎక్కడా లేదని, కేసీఆర్ మానస పుత్రిక అని మాట్లాడిన నువ్వు, కాళేశ్వరం ప్రాజెక్టు కమిషన్ల ప్రాజెక్టు అనడం సరైందేనా..? కవిత అరెస్టును నిరసిస్తూ స్టేషన్‌ఘన్‌పూర్ జాతీయ రహదారిపై బీఆర్ఎస్ శ్రేణులతో ధర్నా చేసింది నువ్వు కాదా..? అని ప్రశ్నించారు. బీఆర్ఎస్ కండువాతో గెలిచి కాంగ్రెస్‌లో చేరగానే కేసీఆర్ కుటుంబం అవినీతిమయంగా కనిపిస్తుందా.. అని విమర్శించారు.

ఏడాది తర్వాత రోళ్లవాగు గుర్తొచ్చిందా?

- మాజీ మంత్రి కొప్పుల ఈశ్వర్

జగిత్యాల, జనవరి 3: 'ఉమ్మడి రాష్ట్రంలో అధికారంలో ఉండగా రోళ్లవాగును పట్టించుకున్నారా?.. ఇప్పుడు అధికారంలోకి వచ్చిన ఏడాది తర్వాత ఈ ప్రాజెక్టు గుర్తొచ్చిందా?' అని మాజీ మంత్రి కొప్పుల ఈశ్వర్ కాంగ్రెస్ నేతలను ప్రశ్నించారు. జగిత్యాల జిల్లా కేంద్రంలోని బీఆర్ఎస్ కార్యాలయంలో శుక్రవారం మీడియాతో మాట్లాడారు. ఉమ్మడి సారంగాపూర్ మండలంలోని రోళ్లవాగు ప్రాజెక్టును ఆధునీకరించాలని 2016లో అప్పటి సీఎం కేసీఆర్, నీటి పారుదల శాఖ మంత్రి హరీశ్‌రావు, ఎంపీ కవిత, తన ఆధ్వర్యంలో నిర్ణయించినట్టు గుర్తుచేశారు. ప్రాజెక్టు ఆధునీకరణతో సారంగాపూర్, బీర్‌పూర్, ధర్మపురి మండలాల్లో దాదాపు 17 వేల ఎకరాల కొత్త ఆయకట్టుకు సాగునీరు అందుతున్నదని నిర్మించినట్టు తెలిపారు. ఉమ్మడి రాష్ట్రంలో కాంగ్రెస్ ప్రభుత్వం దాదాపు 40ఏండ్లు అధికారంలో ఉన్నా ఈ ప్రాంత రైతులకు సాగునీరు అందించాలని ఏనాడూ ఆలోచన లేదని విమర్శించారు. ఈ ప్రాంతం నుంచి పలుమార్లు ఎమ్మెల్యేగా, మంత్రులుగా ప్రాతినిధ్యం వహించిన వారు కూడా దీని గురించి ఆలోచన చేయలేదని తెలిపారు. తెలంగాణ వచ్చాక జగిత్యాల, ధర్మపురి నియోజకవర్గాల్లో 14 లిఫ్టులు ఏర్పాటు చేశామని పేర్కొన్నారు. ఈ లిఫ్టులు, రోళ్లవాగు ప్రాజెక్టు ద్వారా దాదాపు లక్ష ఎకరాలకు నీరందించేలా ఏర్పాట్లు చేసినట్టు తెలిపారు. 2016లో రోళ్లవాగు ప్రాజెక్టును ప్రారంభించామని, 1/4 టీఎంసీ నుంచి 1 టీఎంసీ వరకు దీని సామర్థ్యాన్ని పెంచామని, దీంతో 17 వేల ఎకరాలకు సాగునీరందినట్టు పేర్కొన్నారు. రెవెన్యూ భూమి 279, అటవీ భూమి 850 ఎకరాలు ప్రాజెక్టు పరిధిలోకి రావడంతో ప్రాజెక్టు వ్యయం పెరిగినట్టు తెలిపారు. అనుమతుల కోసం పంపించినా ఇప్పటికీ పూర్తి చేయలేదని విమర్శించారు. కాంగ్రెస్ నాయకులకు చిత్తశుద్ధి ఉంటే వెంటనే గోదావరిలోకి నీళ్లు వదలాలని డిమాండ్ చేశారు. రోళ్లవాగు ప్రాజెక్టు పనులు పూర్తి చేసి సాగునీరందించాలని సూచించారు.

వీక్షణం సంపాదకుడిపై దుష్ప్రచారానికి సీపీఎం ఖండన

హైదరాబాద్, జనవరి 3 (నమస్తేతెలంగాణ): 'వీక్షణం' సంపాదకుడు ఎన్ వేణుగోపాల్ మీద సోషల్ మీడియాలో జరుగుతు న్న ప్రచారాన్ని సీపీఎం తెలంగాణ రాష్ట్ర కార్యదర్శి తమ్మినేని వీరభద్రం ఖండించారు. తమకు నచ్చని పుస్తకాన్ని అమ్ముతున్నారనే పేరుతో వేణుగోపాల్‌పై కొంతమంది దుష్ప్రచారం చేస్తున్నారని ఆయన మండిపడ్డారు. ఈ చర్యలు భావ ప్రకటనా స్వేచ్ఛ మీద, పరిశోధనల మీద దాడి అని అభివర్ణించారు. ఆ పుస్తకాలలో చెప్పిన విషయాలపై అభ్యంతరాలున్న వారు వాటిని ఖండిస్తూ మరో పుస్తకం రాయవచ్చని సూచించారు. అంతే తప్ప ఒక మతానికి చెందినవారిని రెచ్చగొట్టి దాడులకు ప్రోత్సహించడం ప్రమాదకరమని హెచ్చరించారు. ఇలాంటి చర్యల పట్ల అప్రమత్తంగా ఉండాలని, వీటిని ఖండించాలని ప్రజలకు, ప్రజాస్వామ్యవాదులకు ఆయన విజ్ఞప్తి చేశారు.